

హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఎన్‌సీసీ - 2015 కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు

# ఆర్డినెన్స్‌ల జారీ సరదా కాదు

- ఢిల్లీ ఎన్నికల్లో విజయం మాదే
- కేజ్రీవాల్ ప్రజావిశ్వాసం కోల్పోయారు
- కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు

**నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్:** ఆర్డినెన్స్‌ల జారీ పట్ల తమకు సరదా కాదని కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆదివారం హైటెక్ సిటీలోని శిల్పకళావేదికలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా 56వ జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌ను సజావుగా నడిపేందుకు విపక్షాలు సహకరిస్తే ఆర్డినెన్స్‌లను జారీచేయాల్సిన అవసరం రాదన్నారు. తాము ఆర్డినెన్స్‌లను జారీచేయాలని భావించడం లేదన్నారు. మైనారిటీలో ఉన్న విపక్షాలు ఘర్షణాత్మక వైఖరితో సభా కార్యక్రమాలను అడ్డుకోవడం ద్వారా అభివృద్ధిని అడ్డుకోలేవని ఆయన చెప్పారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడం విపక్షాల హక్కు అని పేర్కొన్న కేంద్రమంత్రి.. దానికి ప్రజాతంత్ర పద్ధతులు ఉన్నాయన్నారు. వారి నిరసన తెలియజేసేందుకు వాకౌట్ వంటి పద్ధతులు ఉన్నాయని చెప్పారు. అభివృద్ధి పథకాలు చేపట్టడం ద్వారా మోదీ సర్కార్‌కు మంచి పేరు రావడం విపక్షాలకు ఇష్టం లేదన్నారు. అందుకే వారు రాజ్యసభలో కార్యకలాపాలను స్తంభింపజేస్తున్నారని వెంకయ్యనాయుడు ఆరోపించారు. విపక్షాలు అభివృద్ధిని నిరోధించాలని కోరుకుంటున్నాయని మండిపడ్డారు. దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్న పేరు ప్రధాని మోదీకి రావడం వారికి ఇష్టం లేదన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం అభివృద్ధికి హాలిడే ప్రకటించి జాలీగా గడిపిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం సమర్థ ప్రధాని నేతృత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతున్నదన్నారు. ప్రస్తుతానికి సమయానికి మించి పనిచేయాల్సిన అవసరం ఉన్నదని ఆయన చెప్పారు. ప్రస్తుతం దేశంలో అకౌంటెన్సీ రంగంలో నిపుణుల కొరత ఉన్నదన్నారు. ఉత్తమ ప్రతిభావంతులైన అక్కౌంటెంట్లను తయారు చేయాల్సి ఉన్నదన్నారు. రాజకీయ నేతలు కూడా ఎప్పటికప్పుడు కొత్త విధానాలు తెలుసుకుంటూ మార్గదర్శకులుగా ఉండాలని కేంద్రమంత్రి అన్నారు. కానీ చాలా మంది నేతలు అభ్యాసం మరిచి ధనార్జనకు అలవాటు పడ్డారన్నారు. సదస్సులో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు భట్టాజ్, విశాఖ స్టీల్ ప్లాంట్ సీఎండీ మధుసూదన్ మాట్లాడారు.

### తెలంగాణ సచివాలయం తరలింపుపై
## కేంద్రం జోక్యం చేసుకోదు

సచివాలయాన్ని తరలించాలా? లేదా? అన్న అంశం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదని కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. దీనిపై కేంద్రం జోక్యం చేసుకోబోదని స్పష్టంచేశారు. ఆదివారం హైటెక్ సిటీ వద్ద శిల్పకళావేదికలో జరిగిన నేషనల్ కాస్ట్ అకౌంటెంట్స్ కన్వెన్షన్‌లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడారు. సచివాలయానికి వాస్తుదోషం ఉన్నదా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? దాన్ని ఎక్కడకు తరలించాలి, ఎలా నిర్మించాలన్న అంశం తెలంగాణ ప్రభుత్వ విచక్షణ పరిధిలోని అంశమని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయమని ఆయన ధీమా వ్యక్తంచేశారు. రాజకీయాల్లో ఎనిమిది నెలల శిశువుగా అధికారంలోకి వచ్చిన ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) చేసిన పొరపాట్లను హస్తిన ప్రజలు గుర్తించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపిన ఆప్ పట్ల ప్రజలు విశ్వాసం కోల్పోయారన్నారు. పరిపాలనా అనుభవం లేని ఆప్‌కు మళ్లీ అధికార పగ్గాలు అప్పగించేందుకు వారు సిద్ధంగా లేరన్నారు. తమ సీఎం అభ్యర్థి కిరణ్‌బేడీకి మచ్చలేని చరిత్ర ఉన్నదని, ఆమెకు ప్రజల్లో మంచి ఆదరణ ఉన్నదని కేంద్రమంత్రి అన్నారు. పార్టీలో కూడా ఆమెకు గౌరవం ఉన్నదని, ప్రాధాన్యం తగ్గలేదని చెప్పారు.